



# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

మంగళవారం 25 ఆగష్టు 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3





## ఈ నెల 25 నుండి సామూహికంగా వన మహోత్సవం







భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుండి సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి నాటిన ప్రతి మొక్క బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వనమహోత్సవం పై జిల్లా కలెక్టర్లు, అటవీ ,దేవా దాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని , మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను వార్డులు ,గ్రామాల వారీగా నాటేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఒక్కొక్క మండలంలో 10 వేల మొక్కలకు తక్కువ కాకుండా నాటించాలని, అన్ని మండలాలలో 150 మందికి తక్కువ కాకుండా లేబర్ మొభలైజేషన్ చేయాలని ఆశ్రమ పాఠశాలలు, ఇన్టి ట్యూషన్స్, అటవీ ప్రాంతం లో మొక్కలు నాట డంతో పాటు, వాటిని సంరక్షిం చడం అత్యంత ముఖ్య మని, నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. అంతకు ముందు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మొక్కలు నాటేందుకు ఉన్న అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలని, ఇందులో భాగంగా వనమహోత్సవం కింద ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టి సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, వన మహోత్సవం ద్వారా అటవీ కవరేజీని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ కార్యాల యాలు, సంస్థలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను , మహిళా సంఘాలు, మున్సిపల్ చైర్మన్లు తదితరులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి టీజీ ఫారెస్ట్ పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని , పట్టణ ప్రాంతాల్లో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉన్నందున అక్కడ ఎక్కువగా మొక్కలు నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో విస్తృతంగా పచ్చదనం పెంచాలని ,ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా చర్యలు చేపట్టడంతో పాటు, దేవాలయాల్లో ప్రత్యేకమైన మొక్కలు నాటాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక జిల్లా అటవీశాఖ అధికారి ధమోదరరెడ్డి, జిల్లా పరిషత్ సి ఇ ఓ శిరీష, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య , సంబంధిత శాఖల అధికా రులు హాజరయ్యారు.

## ఆర్థిక అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన ఆర్థిక అవగాహన పోస్టర్ ను జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. బ్యాంకింగ్ సేవలు, పొదుపు, రుణాలు, బీమా, పింఛన్, డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల పాత్ర కీలకమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హరిసింగ్, డి ఆర్ ఓ ప్రేమ్ రాజ్, ఎల్ డి ఎం వెంకట నాగప్రసాద్, డి ఆర్ డి ఓ పి డి సన్యాసయ్య, డిపిఓ యాదగిరి సూర్యాపేట జిల్లా కౌన్సిలర్స్ శ్రవణ్ కుమార్, రాంబాబు, అశోక్, రామకృష్ణ, నరేష్, లక్ష్మణ్, వెంకటేష్, మాధవి, పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, . ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 25 నుండి జరుగు వనమహోత్సవం సందర్భంగా సంబంధిత జిల్లా అధికారులందరూ సామూహిక వనమహోత్సవంలో పాల్గొని వారికి నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయాలని, జిల్లా, మండల ప్రభుత్వ కార్యాలయాలలో ఆగస్టు 31 కల్లా టీ ఫైబర్ ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, ఇరిగేషన్ 4, మున్సిపాలిటీ 4, డి డబ్ల్యు ఓ 3, మిగిలిన 14 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 68 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఎ పిడి సన్యాసయ్య, సిపిఓ కిషన్, డీఎస్ఓ మోహన్ బాబు, డిపిఓ యాదగిరి, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు

## ఎస్ఐఆర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి







భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్‌గా గుర్తించిన ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు, వార్డు పరిధిలో వార్డు సభలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సభల్లో ఓటర్ల జాబితాలోని పేర్లను చదివి వినిపించి, ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే గుర్తించి సరిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, వార్డు సభల నిర్వహణపై ప్రజలకు ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడు తూ ఆగస్టు 27నఅన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలను నిర్వహించాలని, బీఎల్‌వోలు తప్పనిసరిగా ఈ సభల్లో పాల్గొనాలని సూచించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిం చడంతో పాటు సభల వద్ద ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర అవసరమైన దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామ, వార్డు సభల్లో బీఎల్‌వోలు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలోని పేర్లను చదివి వినిపించాలని, జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే ప్రజల దృష్టికి తీసుకువచ్చి సరిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, వార్డు సభల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను డాక్యుమెంటేషన్ చేయడంతో పాటు సభల ఫొటోలు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు లేదా తప్పులుగా నమోదైన పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, డి ఆర్ ఓ ప్రేమ్ రాజ్, సూర్యాపేట ఆర్ డి ఓ వేణు మాధవ్, సి సెక్షన్ సూపరింటెంట్ రాజేందర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తాం

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం




సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన అర్జీల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.

# పోలీస్ సిబ్బంది స్వీయ నియంత్రణ, ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలి




భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

సమాజ భద్రత, పౌరుల భద్రతలో పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేస్తూ పోలీసు సేవలు అందించాలి. అప్పులు చేయడం, భద్రత లేని వ్యాపారాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయి, పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనం, స్వీయ నియంత్రణ అలవర్చుకోవాలి, ముఖ్యంగా చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు పేర్కొన్నారు. ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయం నందు పోలీసు సిబ్బందితో ఎస్పీ గారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిబ్బందికి పలు కీలకమైన ఆర్థిక పరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు హాజరై సిబ్బందికి క్రమశిక్షణతో కూడిన ఆర్థిక నిర్వహణ అంశాల గురించి సుదీర్ఘంగా వివరించారు. సమావేశంలో ఎస్పీ నరసింహ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. సమాజంలో పోలీస్ యూనిఫాంకు ఎంతో గౌరవం ఉంది. కఠినమైన శిక్షణ పొందిన పోలీసులు ఇతరులతో పోలిస్తే భిన్నంగా, సమాజానికి ఆదర్శంగా నిలవాలి. అధిక లాభాల ఆశతో ఎలాంటి భద్రత లేని పథకాలు, అనాధికారిక సంస్థల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు. బెట్టింగ్‌లు, సోషల్ మీడియా వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. అనవసర విలాసాల కోసం అప్పులు చేసి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దు. సిబ్బంది ఎల్లప్పుడూ దీర్ఘకాలిక ప్రయోజనాల వైపు, తమ కుటుంబ ఆర్థిక భద్రత వైపు ఆలోచన చేయాలి, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి. నిరంతరం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీసులు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు సిబ్బంది ఎలాంటి తప్పులు, నేరాలకు పాల్పడకూడదు, సిబ్బందికి వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సమస్యలు ఏవైనా ఉంటే నిర్భయంగా ఉన్నతాధికారులకు చెప్పుకుని పరిష్కరించుకోవాలి. ఈ సంక్షేమ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డీఎస్పీ రవి, అడ్మిన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నారాయణరాజు, ప్రవీణ్ కుమార్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్యాపేట రీజినల్ చీఫ్ మేనేజర్ అరుంధతి, ఫైనాన్సియల్ అసిస్టెంట్ మేనేజర్ రామిరెడ్డి, జిల్లాలోని పలువురు ఎస్సైలు, ఆర్ఎస్సైలు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# వార్డుల అభివృద్ధిపై కాంగ్రెస్ దృష్టి




భానుపురి/సూర్యాపేట టౌన్

వార్డుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 29వ వార్డులో స్థానిక కౌన్సిలర్ రాపర్తి భవాని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సమాజ సేవకులు మహంకాళి సోమయ్య పుట్టినరోజు వేడుకలు





భానుపురి/ సూర్యాపేట టౌన్

సమాజ సేవకులు సూర్యాపేట శ్రీ వాసవి సేవాసమితి జిల్లా సభ్యులు సీనియర్ సిటిజన్ మహంకాళి సోమయ్య పుట్టిన రోజు వేడుక సోమవారం జిల్లా కేంద్రంలోనీ శ్రీ వాసవి సేవాసమితి కార్యాలయం లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా శ్రీ వాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం మాట్లాడుతూ మహంకాళి సోమయ్య సూర్యాపేట సీనియర్ సిటిజన్ లోఎన్నో విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 75 సంవత్సరాల వయసులోనూ కూడా నవ యువకుడిగా ఎన్నో సమాజసేవ కార్యక్రమాల్లో తనదైన శైలిలో పాల్గొంటున్నారని కొనియాడారు. శ్రీ వాసవి సమితి ఎల్లప్పుడూ నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా నిలుస్తుందని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సేవా సమితి ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవాసమితి ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు కోశాధికారి సోమా ప్రవీణ్ కుమార్ ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్ మహంకాళి ప్రణీత్ సభ్యులు శ్రీరంగం రాము, పోలా లక్ష్మీ నారాయణ, తాటిశెట్టి హనుమంత్, చల్లా సత్యనారాయణ (కిరాణ) తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు, తాగునీటి పనులకు శంకుస్థాపన




భానుపురి/సూర్యాపేట టౌన్

పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 34వ, 2వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేశారు. 34వ వార్డులో ఎంపీ గ్రాంట్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, 2వ వార్డులోని ఎస్సీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా పూర్తి చేస్తామని అన్నారు. ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ తాహెర్, సయ్యద్ తన్వీర్ హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్ యం.డి. షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, రాష్ట్ర,జిల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలి



భానుపురి/సూర్యాపేట టౌన్

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా అనుసరిస్తున్న ఏకపక్ష, అప్రజాస్వామిక, రాజకీయ పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు మోదుగు వెంకట్ రెడ్డి, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి లు డిమాండ్ చేశారు. సూర్యాపేట కోర్టు విధుల బహిష్కరించిన అనంతరం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ---మనన్ కుమార్ మిశ్రా పద్నాలుగు సంవత్సరాలకు పైగా బీసీఐ చైర్మన్‌గా కొనసాగుతూ, చట్టబద్ధమైన ప్రజాస్వామిక సంస్థలో అధికారాన్ని వ్యక్తిగతంగా కేంద్రీకరించడం అభ్యంతంˇకరమన్నారు. బీసీఐ ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదని, దేశంలోని న్యాయవాదులందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని పేర్కొన్నారు. బీసీఐ అధికారిక పదవిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం సంస్థ స్వతంత్రతను, విశ్వసనీయతను దెబ్బతీస్తుందని విమర్శించారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ పట్టభద్రులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడం ఏకపక్షమైన, చట్టవిరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు శాంతియుతం గా అభిప్రాయం వ్యక్తం చేసినందుకు మొత్తం బ్యాచ్‌ను శిక్షించడం రాజ్యాంగ విలువలకు, న్యాయవాదుల చట్టం--1961కు విరుద్ధమన్నారు. ఆదేశాలను అనంతరం ఉపసంహరించుకున్నప్పటికీ, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత నుంచి చైర్మన్ తప్పించు కోలేరన్నారు. ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులను నామినేషన్ల ద్వారా అధికార స్థానాల్లోకి తీసుకు రావడానికి ప్రయత్నించడం ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమన్నారు. న్యాయవిద్య ప్రమాణాలు, న్యాయ కళాశాలల తనిఖీలు, అనుమతులకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీసీఐ కోల్పోయిన గౌరవం, విశ్వస నీయత, ప్రజాస్వామిక స్వభావాన్ని పునరుద్ధ రించేందుకు మనన్ కుమార్ మిశ్రా వెంటనే చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని మోదుగు వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాతి సవిందర్ కాకి రాంరెడ్డి బార్ ఆ మాజీ అధ్యక్షులు కొంపెల్లి లింగయ్య కార్యదర్శి హసేన్ వి నర్సయ్య బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, నాయకులు సుంకంˇబోయిన రాజు, అశోక్ బి నర్సింహ, కొంపల్లి లింగయ్య కె.రంజిత్, సుస్మిత, ప్రభాత్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పట్టణ అధ్యక్షుడు
# బూర మల్సూర్ గౌడ్ కు సన్మానం

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణ బిజెపి అధ్యక్షులు గా ఇటీవల ఎన్నికైన బూర మల్సూర్ గౌడ్ ను సూర్యాపేట జిల్లా కేంద్రంలోనీ ఆయన నివాసంలో సోమవారం బిసి సంక్షేమ సంఘం అధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. సూర్యాపేట పట్టణ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు, బిసి సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సుంకర కిరణ్, ముద్దంగుల యాదగిరి, బెజవాడ జగన్ గౌడ్, వెంకన్న గౌడ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# సారంపల్లిమల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు

భానుపురి/సూర్యాపేట టౌన్



సిపిఎంపార్టీ సీనియర్ నేత,రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతు ఉద్యమాలకు తీరని లోటు అని, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో సారంపల్లి మల్లారెడ్డి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మూడు గంటలకు అనారోగ్యంతో మృతి చెందారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సంఘం నిర్మాణంలోకీలక పాత్ర పోషించారని,వ్యవసాయ రంగ నిపుణుడిగా, నీటిపారుదల రంగంలో నిష్ణాతుడిగా అపార అనుభవం కలిగిన నాయకుడని అన్నారు. అనేకమంది రాజకీయ నాయకులు, అధికారులు కూడా మల్లారెడ్డి దగ్గర సలహాలు తీసుకునే వారిని అలాంటి వ్యక్తి మరణించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సూర్యాపేట ప్రజల చిరకాల వాంఛ రైల్వే లైన్ సాధించి తీరుతాం

భానుపురి/సూర్యాపేట టౌన్




సూర్యాపేట ప్రజలకు చిరకాల వాంఛ అయిన రైల్వే లైన్ ను సాధించుకునేందుకు బుల్లెట్ సాధన సమితి అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నరసయ్య, సంకినేని వెంకటేశ్వర్ రావు లో అన్నారు. జాతీయ రహదారి 65కు సమాంతర బుల్లెట్ ట్రైన్ సాధన కోసం బుల్లెట్ సాధన సమితి అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ రోజు రిలే నిరాహార దీక్షలు నాయకులు దీక్షలో కూర్చోవడంతో వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న జర్నలిస్ట్ జేఏసీ నాయకులు వజ్జే వీరయ్య, గుండ శ్రీనివాస్ గుప్తా లు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే లైన్ వస్తే ఈ ప్రాంతమంతా సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. మొదటగా సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ జరిగినప్పటికీ దాన్ని పక్కదారి పట్టించి రాజకీయాలు చేశారని ఆరోపించారు. రైల్వే లైన్ ఉన్న వైపే మరో రైల్వే లైను వేయడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి మొదట కేటాయించినట్లుగా సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అలాట్మెంట్ జరగాలన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన కోసం రైల్వే సాధన సమితి అఖిలపక్షాల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతి పోరాటానికి తమ వంతు మద్దతు ఉంటుందన్నారు. ఈ దీక్షలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## లక్ష గొంతుకల పొలికేక విజయవంతం చేయండి

భానుపురి/సూర్యాపేట టౌన్



బుల్లెట్ ట్రైన్ సాధించాలన్న పట్టుదలతో సూర్యాపేట జిల్లా ప్రజలు కొనసాగిస్తున్న ఉద్యమాలకు ప్రజల ఆదరణ అమోఘమైందని ఉద్యమ కార్యక్రమంలో భాగంగా నేడు జరిగే లక్ష గొంతుకల పొలికేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు అలాట్మెంట్లు సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వ అలైన్మెంట్ మార్చి జాతీయ రహదారి 65 సమాంతర పట్టణాల సూర్యాపేట ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అనంతకాలంలోనే బుల్లెట్ ట్రైన్ ఉద్యమం ఊహించని స్థాయిలో జిల్లా వ్యాప్తంగా ఉధృతంగా కొనసాగుతుందని అని తెలిపారు. మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద లేదా తమ వీధిలో గుమి కూడి ప్రతి ఒక్కరు బుల్లెట్ ట్రైన్ సూర్యాపేటకు రావాలి, బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ఉద్యమిస్తాం, అంటూ మూడుసార్లు ఢిల్లీ వరకు మన పొలికేకను వినిపించేలా నినాదాలు చేయాలని కోరారు. జిల్లాలో అఖిలపక్ష ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ సహకారం అందిస్తున్నందున ఈ కార్యక్రమాన్ని కూడా ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని వారు సందర్భంగా కోరారు.

# అక్రమ వెల్‌నెస్ సెంటర్లు, గంజాయి దందా పై ఉక్కుపాదం మోపాలి



-బీజేపీ వన్ టౌన్ నాయకుల ఆధ్వర్యంలో డీఎస్పీ కి వినతి

భానుపురి/ నల్గొండ :

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ వెల్‌నెస్ సెంటర్లు, గంజాయి దందాల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ వన్ టౌన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ వన్ టౌన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బంటుగిరి, కొంగరి వెంకటరమణ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఇన్‌చార్జ్ డీఎస్పీ రవి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణం లో కొందరు వ్యక్తులు ద్రావణం పేరిట లావుగా ఉన్నవారిని సన్నగా చేస్తామని నమ్మబలుకుతూ అమాయక ప్రజల ఆరోగ్యంతో, సొమ్ముతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా, పక్క రాష్ట్రం జీఎస్టీ నంబర్లను వాడుతూ, గ్రామాల్లో దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసి గొలుసుకట్టు వ్యాపారం చేస్తున్నారని, ఇలాంటి అక్రమ సెంటర్లను తక్షణమే మూసివేయాలని కోరారు. అలాగే పట్టణంలో యువత ఎంజాయ్ పేరుతో గంజాయి సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గల్లీలు, దాబాలు, కిరాణా షాపులు, టీ స్టాళ్లు, నిర్మాణంలో ఉన్న భవనాలను గంజాయి అడ్డాలుగా మార్చారని, గంజాయి సరఫరా చేస్తున్న ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టి, శాంతిభద్రతలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిల్లంచర్ల అభి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెలుగు ఇందిరా నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెలుగు నాగరాజు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు బంటు యాదగిరి, వన్ టౌన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, చిలుకూరి వెంకటేశ్వర్లు, మునగాల శివ, మండల సోములు, బంటుగిరి నాగరత్నం, మోషం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ ఆదేశాలతో రోడ్డుపై నిల్వ ఉన్న నీళ్లను తొలగించిన మున్సిపల్ సిబ్బంది

భానుపురి/ ఆలేరు:



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో సోమవారం ఉదయం కురిసిన వర్షాలకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నీరు నిలవడంతో మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ వెంటనే స్పందించి వర్షం నీరు నిల్వ ప్రాంతాలను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన నీళ్లను మురికి కాలువకు మళ్లించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో వెంటనే మున్సిపల్ కార్మికులు ఆ నీటిని డ్రైనేజీలోకి మళ్లించారం ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు.. బస్టాండ్ ముందు, సినిమా టాకీస్ గల్లి వద్ద పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి ఉండి ప్రజల, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. విషయం తెలిసి మున్సిపల్ చైర్మన్ వెంటనే ఆ ప్రాంతాలను పరిశీలించి మున్సిపల్ అధికారులను ఈ ఆదేశించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాట శివ, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



